ప్రభుత్వం మారింది..
అభివృద్ధి ఆగింది..

- లష్కర్ అభివృద్ధి తిరోగమనం
- పునాదిరాళ్లకే పరిమితమైన నిర్మాణాలు
- సికింద్రాబాద్ ప్రజల్లో నిరాశ నింపిన 2024


సీతాఫల్‌మండిలో నిలిచి పోయిన కాలేజీ నిర్మాణ పనులు


భవన నమూనా

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజల్లో ఈ ఏడాది నిరాశను నింపింది. గడచిన రెండేళ్లలో ఊహించని తరహాలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఏకంగా రూ.100 కోట్లతో భారీ ప్రాజెక్టులను చేపట్టారు. వచ్చే రెండేళ్లలో లష్కర్ గణనీయమైన అభివృద్ధి సాధిస్తుందని అందరూ భావించారు. కానీ లష్కర్ ప్రజల ఆశలపై 2004 సంవత్సరం నీళ్లు చల్లింది. ' అభివృద్ధి పేరిట ఉన్న భవనాలను నేలమట్టం చేసి కొత్త భవనాల కోసం ప్రారంభోత్సవాలు చేసినా అవి పునాదులకే పరిమితమయ్యాయి. సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలవడం, గత ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించిన అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేయడంతో వాటి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సికింద్రాబాద్ నుంచి వరుసగా మూడు మార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేబినెట్ హోదాలో ఉండి పలు భారీ అభివృద్ధి పనుల కోసం రూ.100 కోట్ల మేర నిధులు మంజూరు చేయించుకున్నారు. వీటికి గత శాసనసభ ఎన్నికలకు ముందు ప్రారంభోత్సవాలు చేసుకున్నారు. అయితే ఆ తర్వాత కొద్ది రోజులకే ఎన్నికలు రావడం, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోవడంతో అభివృద్ధి పనులన్నీ అర్ధాంతరంగా ఆగిపోయాయి.

ఉన్న భవనాలు కూల్చి..

అభివృద్ధి పనుల్లో భాగంగా ఈ ప్రాంత పేదలకు పెద్ద దిక్కుగా ఉన్న భవనాలు రెండింటినీ అధికారులు నేలమట్టం చేశారు. అందులో ఒకటి సీతాఫల్‌మండి ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం కాగా, మరొకటి ఇదే ప్రాంతంలోని ప్రభుత్వ ఆసుపత్రి. ఈ రెండు భవనాల నిర్మాణం పునాది రాళ్లకే పరిమితం కావడంతో అటు విద్యార్థులు, ఇటు రోగులు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారు. ఉన్నత పాఠశాల భవనాన్ని నేలమట్టం చేయడంతో పాఠశాలల విద్యార్థులను ఓయూ మోడల్ పాఠశాలకు, జూనియర్ కళాశాల విద్యార్థులను కమ్యూనిటీ హాల్‌కు, డిగ్రీ విద్యార్థులకు విద్యానగర్‌కు బదలాయించారు. దీంతో విద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్లడంతోపాటు అక్కడి ఇరుకు గదుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఆసుపత్రి సేవలు కూడా మూడు ప్రాంతాలకు బదలాయించారు. ఇందులో ప్రసూతి సేవల నిమిత్తం మెట్టుగూడ రైల్వే క్వార్టర్స్ ప్రాంతంలోని ఒక పురాతన భవనానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంత ప్రజలు, ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు చేపట్టిన వంతెనల నిర్మాణం కూడా ప్రతిపాదనలకే పరిమితమైంది. మెట్టుగూడ-చిలకలగూడ, సీతాఫల్‌మండి-మాణికేశ్వరీనగర్ రైల్వే వంతెనల పనులు ప్రారంభమయ్యే అవకాశం కనిపించడం లేదు. అడ్డగుట్ట, లాలాపేటలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్లు, లాలాపేట స్విమ్మింగ్‌పూల్ నిర్మాణం పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో పేదలు వివాహాది శుభ కార్యాలకు ఇబ్బందులు పడుతున్నారు.

ముందుకు సాగని పనులు

సీతాఫల్‌మండి రూ. 12 కోట్లతో చేపట్టిన కుట్టివెల్లోడి ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం ఏడాదిగా పునాదులకే పరిమితమైంది. ఇటీవల తిరిగి పనులు ప్రారంభమైనా మందకొడిగా సాగుతున్నాయి. రూ.29.75 కోట్లతో చేపట్టిన సీతాఫల్‌మండి హైస్కూల్, కళాశాలల భవన సముదాయం నిర్మాణ పనులు ఏడాదిగా ముందుకు సాగడం లేదు. ఇక్కడి పునాది నిర్మాణ పనులు సైతం అసంపూర్తిగా ఉండడం గమనార్హం.రూ.6 కోట్లతో చేపట్టిన లాలాపేట స్విమ్మింగ్‌పూల్, రూ.3 కోట్లతో చేపట్టిన అడ్డగుట్ట, లాలాపేట మల్టీపర్పస్ కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు కూడా అర్ధాంతంగా నిలిచిపోయాయి. ఇదిలా ఉండగా రూ.30 కోట్ల నిధులు మంజూరైన మెట్టుగూడ-చిలకలగూడ రైల్వే వంతెన, రూ.20 కోట్లు మంజూరైన సీతాఫల్‌మండి-మాణికేశ్వరీనగర్ వంతెన నిర్మాణ పనులు ఇప్పట్లో ప్రారంభమయ్యే సూచనలు కనిపించడం లేదు.

చిరు వ్యాపారులకు అండగా ఉంటా


చిరువ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

సనత్‌నగర్: చిరు వ్యాపారులకు అండగా ఉంటానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని బేగంపేట డివిజన్ శ్యాంలాల్ బిల్డింగ్స్‌లో ఉంటున్న చిరు వ్యాపారులు ఖాళీ చేయాలని ట్రాఫిక్ పోలీసులు ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో వారు సమస్యను బీఆర్ఎస్ బేగంపేట డివిజన్ అధ్యక్షుడు పొన్నబోయిన సురేష్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన మంగళవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసి సమస్యను విన్నవించారు. చిరు వ్యాపారాలతోనే తమ కుటుంబాలు గడుస్తున్నాయని, అలాంటి వ్యాపారాలను తొలగిస్తే తమ పరిస్థితి ఏమిటని ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ చిరు వ్యాపారులను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదన్నారు. తాను 26న శ్యాంలాల్ బిల్డింగ్స్‌లో నేరుగా పర్యటించి ట్రాఫిక్ అధికారులతో మాట్లాడతానన్నారు. చిరు వ్యాపారులకు తాను అండగా ఉంటానని, ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు.

ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎరుకల సంఘం నేతలు

లాలాపేట: ఎరుకల సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సంఘం నాయకులు అన్నారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎరుకలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, నిజాంపేటలో పెండింగ్‌లో ఉన్న ఆత్మగౌరవ భవన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఎరుకల ఎంపవర్‌మెంట్ పథకాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు, ఎరుకల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ సదానంద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుతాడి రవికుమార్, కోశాధికారి వనం రమేష్, దేవరాయ ఎల్లేష్, దేవరాజు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఏం కష్టమొచ్చిందో ఏమో..?

- గత నెలలో నిశ్చితార్థం..
- ఇంతలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య
- సురేఖ మృతదేహానికి పోస్టుమార్టం
- గాంధీ మార్చురీ వద్ద విషాదఛాయలు


సురేఖ (ఫైల్)

గాంధీఆస్పత్రి : ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకునే సమయం.. ప్రభుత్వ ఉన్నత ఉద్యోగమే లక్ష్యంగా కష్టపడి చదువుతూ గ్రూప్స్‌తోపాటు రైల్వే ఉద్యోగాలకు సన్నద్ధం అవుతోంది. కుటుంబసభ్యుల కోరిక మేరకు గతనెలలో నిశ్చితార్థం జరిగింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న పెళ్లి జరగాల్సి ఉంది. అంతలో ఏమైందో తెలియదు కానీ.. సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని అర్ధాంతరంగా తనువు చాలించి తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చింది. కామారెడ్డి జిల్లా, గాంధారి మండలం, సోమారంతండాకు చెందిన గుగులోతు సురేఖ (22) జవహర్‌నగర్‌లోని హాస్టల్‌లో ఉంటూ సోమవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే.. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జవహర్‌నగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటున్న సురేఖ ప్రభుత్వ ఉద్యోగం కోసం సన్నద్ధం అవుతోంది. ఇటీవల జరిగిన గ్రూప్-2 పరీక్షలు రాసింది. గ్రూప్-1తో పాటు రైల్వే ఉద్యోగాల కోసం కష్టపడి చదువుతోంది. ఈ క్రమంలో నిజామాబాద్‌కు చెందిన యువకుడితో ఆమెకు గత నెలలో నిశ్చితార్థం జరిగింది. ఫిబ్రవరి 7న వివాహం చేయాలని నిర్ణయించారు. కారణాలు పూర్తిగా తెలియలేదు కానీ సోమవారం రాత్రి హాస్టల్ గదిలోని సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొన ఊపిరితో ఉన్న ఆమెను గాంధీఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. గాంధీ మార్చురీలో మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి సురేఖ మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మార్చురీ వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చిక్కడపల్లి, చిలకలగూడ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బీఆర్ఎస్ నేతల పరామర్శ..

గాంధీ మార్చురీ వద్ద మృతురాలు సురేఖ తల్లితండ్రులు లాడుబాయి, బాపుసింగ్‌ను మంగళవారం బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన పెంచుకోవాలి


కేక్ కట్ చేస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: ప్రతి ఒక్కరూ వినియోగదారుల హక్కులపై అవగాహన పెంచుకోవాలని వినియోగదారుల హక్కుల సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు అన్నారు. మంగళవారం వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ఆర్పీరోడ్, బాటా, పాలికాబజార్ తదితర ప్రాంతాల్లో వినియోగదారుల హక్కులపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి వినియోగదారులకు మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి వినియోగదారుడేనని, వినియోగదారుడికి ఎలాంటి హక్కులు ఉంటాయి, వ్యాపారులు, సంస్థల చేతిలో మోసపోతే ఎవరిని కలవాలి, నష్ట పరిహారాన్ని ఎలా పొందాలి అనే అంశాలపై అవగాహన అవసరం అన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు వల్లాల రవియాదవ్, శివకుమార్, ప్రధాన కార్యదర్శి నాగేష్ , దుర్గా ప్రసాద్, రాజు యాదవ్, రాజేష్, ప్రభాకర్, ఆకుల కవిత, బండి రజిని, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి


నిరసన కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ సెక్రటరీ రాజేష్ యాదవ్ తదితరులు

రసూల్‌పురా: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌ను కించపరిచేలా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలని కాంగ్రెస్ నేతలు అన్నారు. ఈ మేరకు మంగళవారం ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, టీపీసీసీ సెక్రటరి రాజేష్ యాదవ్, మహేష్ యాదవ్, వినోద్ అన్నానగర్ మురళి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా టీపీసీసీ సెక్రటరి రాజేష్ యాదవ్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి అమిత్‌షా బహిరంగంగా అంబేడ్కర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై ఓయూలో నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ: భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలు దారుణమని ఓయూ విద్యార్థి నేతలు అన్నారు. ఈ మేరకు మంగళవారం బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఎన్‌సీసీ గేటు నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్ట్స్ కాలేజీ ఎదుట బీఎస్ఎఫ్ఐ నేషనల్ కోఆర్డినేటర్ కరుణాకర్ మాట్లాడుతూ అమిత్ షా పదవి నుంచి తప్పుకు దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాము, గ్రేటర్ ఇంఛార్జి సాపకుమార్, జయచంద్ర, ఉదయ్, వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉండాలి


తెలంగాణ సేవాదళ్ అధ్యక్షుడితో అడ్డగుట్ట నేతలు

అడ్డగుట్ట: తెలంగాణ కాంగ్రెస్ సేవాదళ్ కార్యకర్తలు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ అన్నారు. మంగళవారం సేవాదళ్ తెలంగాణ సెక్రెటరీ పీ. సంగీత నేతృత్వంలో అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన పలువురు నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా సేవాదళ్ సికింద్రాబాద్ ప్రధాన కార్యదర్శిగా వెంకటరాజం, అడ్డగుట్ట అధ్యక్షురాలిగా మేరీ, ఉపాధ్యక్షుడిగా రవి, ప్రధాన కార్యదర్శులుగా పద్మ, మహేశ్వరి, తిలక్‌లను నియమించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు రామలీల తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి ఆశయ సాధనకు కృషి చేయాలి

- ఘనంగా మాజీ ప్రధాని వాజ్‌పేయి శతజయంతి వేడుకలు


స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న బీజేపీ నేతలు

చిలకలగూడ : దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి వేడుకలను పురస్కరించుకుని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి ఆకారం రమేష్ నేతృత్వంలో మంగళవారం చిలకలగూడ గాంధీ చౌక్ వద్ద బీజేపీ శ్రేణులు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్ సుందర్‌గౌడ్, మేకల సారంగపాణి, పెద్ది రవీందర్ మాట్లాడుతూ దేశం కోసం, ధర్మం కోసం సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్న గొప్ప నాయకుడు వాజ్‌పేయి అన్నారు. భావి తరాలు ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన, ప్రశాంతమైన జీవనం లభిస్తుందన్నారు. అనంతరం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించి చిలకలగూడ గాంధీ చౌక్, అంతర్గత రహదారులు, పరిసర ప్రాంతాలను శుభ్రంచేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగేశ్వరరెడ్డి, రాచమల్ల కృష్ణమూర్తి, ఆకారం రమేష్, రవిప్రసాద్‌గౌడ్, ప్రభుగుప్తా, హరి, అనిత, రాజేష్, సంపత్, ప్రతాప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోండా మార్కెట్ అభివృద్ధికి కృషి


మోండా మార్కెట్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

పద్మారావునగర్: సికింద్రాబాద్ మోండా మార్కెట్ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం మోండా మార్కెట్‌ను సందర్శించిన ఆయన వ్యాపారుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు 100 ఏళ్ల చరిత్ర కలిగిన మోండా మార్కెట్‌పై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. హోల్‌సేల్, రిటైల్ వ్యాపార కార్యకలాపాలు కొనసాగుతున్న మోండా మార్కెట్‌లో వసతులు లేక వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మార్కెట్‌లో రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. పశువుల సంచారం కారణంగా ఇబ్బంది పడుతున్నామని పలువురు వ్యాపారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మోండా మార్కెట్ సమగ్రాభివృద్ధికి ఆయా విభాగాల అధికారులతో సమావేశాన్ని నిర్వహించి ప్రణాళికలను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు.

ముగిసిన టీ-20 క్రికెట్ పోటీలు


విజేతలతో నిర్వాహకులు

అడ్డగుట్ట: తెలంగాణ స్కూల్స్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా, కొంపల్లి ఫైన్‌క్యాబ్, జీఎం గ్రౌండ్స్‌లో జరిగిన 1వ సౌత్‌జోన్ అండర్ 14 టీ-20 క్రికెట్ టోర్నమెంట్ పోటీలు మంగళవారం ముగిశాయి. మూడు రాష్ట్రాల నుంచి 12 జట్లు ఈ పోటీలో పాల్గొన్నట్లు ఆర్గనైజర్ ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో మొదటి కప్ విజేతగా సూర్య గ్లోబల్ స్కూల్, రన్నరప్‌గా ఆంధ్రప్రదేశ్ ఎలైట్ క్రికెట్ అకాడమీ, మూడో స్థానంలో కర్ణాటక సహారా క్రికెట్ అకాడమి, నాలుగో స్థానంలో సమ్మర్ రిటరీస్ హైస్కూల్ ఇనోక్ డేనియల్ జట్లు నిలిచాయి. టోర్నమెంట్ బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా హర్షిత్, బెస్ట్ బౌలర్‌గా సాయి హర్షత్ అవార్డులు అందుకున్నారు.కార్యక్రమంలో కోచ్‌లు సంతోష్, ఎంవీ రావు, కామేశ్వర్, వెంకట్, వేణు, సీతారాం, జగన్నాథ్, రమేష్, సన్నీ, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితపై ఆరోపణలు అర్థరహితం

ఓయూ ఏసీపీకి బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు


ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ నాయకులు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఓయూ ఏసీపీ జగన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. యూట్యూబ్ ఛానెల్‌లో యాంకర్లుగా పని చేస్తున్న సీఎస్ రావు, సుంకరీ వెంకటేశ్వర్లు ఎమ్మెల్సీ కవితపై నిరాధారమైన ఆరోపణలు చేసినందుకు వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏసీపీని కలిసిన వారిలో విద్యార్థి నాయకులు కందుల మధు, కె.విజయరావు తెలిపారు. కార్యక్రమంలో రవికిరణ్, రంగా, పవన్ తదితరులు ఉన్నారు.

రేవతి కుటుంబానికి అండగా ఉండాలి

ఉస్మానియా యూనివర్సిటీ: సంధ్య థియేటర్ ఘటనలో మృతి చెందిన రేవతి కుటుంబానికి పుష్ప-2 చిత్రం నిర్మాతలు రూ.50 లక్షల ఆర్థిక సహాయం చేయడం పట్ల ఎన్‌టీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు, ఓయూ జేఏసీ ఛైర్మన్ బైరు నాగరాజుగౌడ్ మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ రేవతి కుటుంబానికి న్యాయం జరగాలనే తాము కేసులకు భయపడకుండా అల్లు అర్జున్ ఇంటిని ముట్టడించామన్నారు. దీనిపై స్పందించిన చిత్ర యూనిట్ ఆర్థిక సహాయం అందించినట్లు ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ బాధిత కుటుంబానికి అండగా ఉండాలని కోరారు.

ట్రాఫిక్ విధుల్లో ట్రాన్స్‌జెండర్లు


మెట్టుగూడ ఆలుగడ్డబావి వద్ద ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న ట్రాన్స్‌జెండర్లు

చిలకలగూడ : ట్రాన్స్‌జెండర్లకు ఆర్థిక భరోసా, సమాజంలో గౌరవం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ విభాగం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రక్రియలో మరో ముందడుగు పడింది. చిలకలగూడ ట్రాఫిక్ ఠాణా పరిధిలో ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు మంగళవారం విధుల్లో చేరారు. శిక్షణ ముగిసిన అనంతరం చిలకలగూడ ట్రాఫిక్ ఠాణాకు ఇరువురు ట్రాన్స్‌జెండర్లను అలాట్ చేశారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పర్యవేక్షణలో మెట్టుగూడ ఆలుగడ్డబావి వద్ద మంగళవారం విధులు నిర్వహించిన వారు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. వీరిని ట్రాఫిక్ పోలీస్ అసిస్టెంట్లుగా పిలుస్తారు. ట్రాఫిక్ పోలీసులు నిర్వహించే అన్ని విధులు, బాధ్యతలను వీరు నిర్వహిస్తారని చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహా పడిపూజ


అయ్యప్ప స్వామికి హారతి ఇస్తున్న మాలధారులు

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ మైలార్‌గడ్డలో మంగళవారం అల్వాశివ గురుస్వామి నేతృత్వంలో అయ్యప్ప మహాపడిపూజ ఘనంగా జరిగింది. మేళతాళాలు, భాజాభజంత్రీలు, భజనగీతాలు, మాలధారుల శరణఘోషలతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ కాంగ్రెస్ నాయకులు బండ చంద్రారెడ్డి, జలంధర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మురళీధర భక్తసమాజం ప్రతినిధి అశ్విన్‌గురుస్వామి బృందం ఆలపించిన భజన భక్తిగీతాలు ఆహుతులను అలరించాయి. 24 ఏళ్లుగా క్రమంగా తప్పకుండా అయ్యప్పస్వామి మహాపడిపూజ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

శాంతినగర్‌లో..

లాలాపేట: శాంతినగర్‌లో గురుస్వామి ఈశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం 23వ అయ్యప్ప పడి పూజా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అయ్యప్ప గీతాలు, భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో గురుస్వాములు రమేష్ గుప్తా, సాయి, ప్రమోద్, నర్సింహ, రాజు, ఎల్ఎల్ బి శ్రీనివాస్‌గౌడ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

గొల్లకొమురయ్య కాలనీలో..

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ గొల్లకొమురయ్య కాలనీలో అయ్యప్పస్వామి 18వ మహాపడి పూజ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీ ధర్మశాస్త్ర భక్త బృందం వెంకటనారాయణ అధ్వర్యంలో ఆలపించిన భక్తి పాటలు భక్తులను అలరించాయి. గోపన్న గురుస్వామి, శ్రీ వీరమణికంఠ సేవా సమితి కోడూరు రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆయన తనయుడు జయసింహ, తలసాని సాయియాదవ్, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీపతి, పద్మారావునగర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడి బాల్‌రెడ్డి, డాక్టర్ రవికుమార్, ప్రసాద్, గురుస్వామి దేవరాజ్, గోపాల్ తదితరులు హాజరయ్యారు.


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

సమస్యల పరిష్కారానికి చర్యలు


మోండా మార్కెట్‌లో పర్యటిస్తున్న డాక్టర్ కోట నీలిమ

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో నెలకొన్న సమస్యల కారణంగా ఇటు వ్యాపారులు, అటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ అన్నారు. మంగళవారం ఆమె కాంగ్రెస్ నాయకులతో కలిసి మార్కెట్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక వ్యాపారులు మార్కెట్‌లో నెలకొన్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. మోండా మార్కెట్‌లో మురుగునీటి కాల్వ పూడిపోవడంతో మురికినీరు రహదారులపై ప్రవహిస్తుందన్నారు. సరైన రోడ్లు లేక, వీధిదీపాలు వెలుగక ఇబ్బందులు పడుతున్నామన్నారు. మార్కెట్ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, కాంగ్రెస్ నాయకులు గంటా సుధీర్, బద్రీనాథ్ యాదవ్, డాక్టర్ శివకుమార్ లాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379